క్లుప్తంగా

సీసీ టీవీ, కెమెరా రిపేర్లపై శిక్షణ

ఏలూరు(ఆర్‌ఆర్‌పేట): సత్రంపాడులోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో సీసీ టీవీ, కెమెరా రిపేర్లల్లో శిక్షణ ఇవ్వనున్నట్టు సంస్థ డైరెక్టర్ ఎం ఫణి కిషోర్ తెలిపారు. అక్టోబర్ 3 నుంచి 13 రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. సీసీ టీవీ, కెమెరా రిపేరింగ్‌లో పురుషులకు, మహిళలకు 13 రోజులు, జూట్ బ్యాగ్‌ల తయారీకి మహిళలకు 13 రోజులు శిక్షణ ఉంటుందని, 18 నుంచి 45 సంవత్సరాల వారు అర్హులని పేర్కొన్నారు. శిక్షణా సమయంలో భోజనం, హాస్టల్ వసతి ఉచితమని, శిక్షణ పూర్తి చేసిన వారికి ఉచితంగా టూల్ కిట్లు, బ్యాంకు నుంచి సర్టిఫికెట్ ఇస్తారని తెలిపారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తికి గాయాలు



చికిత్స పొందుతున్న రమేష్

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలోని ప్రముఖ హాస్పిటల్ ఫ్లెక్సీలు కడుతున్న సమయంలో విద్యుత్తాఘాతానికి గురైన వ్యక్తి తీవ్ర గాయాల పాలయ్యాడు. బాధితుడు ప్రస్తుతం ఏలూరు నగరంలోని ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు పవర్‌పేట ప్రాంతానికి చెందిన రౌతు రమేష్ (42) స్థానికంగా భార్యాపిల్లలతో కలిసి జీవిస్తున్నాడు. నగరంలోనే ఫ్లెక్సీలు అంటించి, వాటిని కడుతూ జీవనోపాధి పొందుతున్నాడు. సోమవారం ఏలూరు సీఆర్‌ఆర్ కాలేజీ వద్ద ఫ్లెక్సీ కడుతుండగా విద్యుత్ వైరు తలకు తగలటంతో తీవ్ర గాయాలయ్యాయి. తోటి కార్మికులు అతడ్ని ఏలూరు జీజీహెచ్‌కు తరలించారు. అనంతరం ఏలూరులోని ఒక ప్రైవేటు హాస్పిటల్‌లో రమేష్ చికిత్స పొందుతున్నాడు.

భార్యపై కోపంతో ఆత్మహత్య

ఏలూరు టౌన్: భార్యతో తరచు గొడవలు పడుతూ, ఆమెపై కోపంతో కూల్‌డ్రింక్‌లో ఎలుకల మందు కలుపుకుని తాగితీవ్ర అస్వస్థతకు గురైన భర్త హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఏలూరు కొత్తపేటకు చెందిన లారీ డ్రైవర్ హంసల వెంకట సత్యనారాయణ (56) భార్య, పిల్లలు ఉన్నారు. భార్యతో తరచు గొడవలు పడుతూ గతంలోనూ రెండుసార్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈనెల 12న కూల్‌డ్రింక్‌లో ఎలుకల మందు కలుపుకుని తాగటంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు అతడ్ని ఏలూరులోని ఆంధ్రా హాస్పిటల్‌కు తరలించగా వైద్యులు చికిత్స అందించారు. ఆరోగ్యం విషమించటంతో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. టూటౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

10న ‘విజయవాడ మార్చ్’

- అక్టోబరు ఒకటి తర్వాత అధికారిక వాట్సాప్‌ల నుంచి వైదొలగుతాం
- గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల హెచ్చరిక
- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



పాత బస్టాండ్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందిస్తున్న సచివాలయ ఉద్యోగులు

ఏలూరు (టూటౌన్): సమస్యలు పరిష్కారం కోరుతూ ఏలూరు నగరపాలక సంస్థలో పనిచేస్తున్న గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ఈ నెల 8 నుంచి ఆందోళన కొనసాగిస్తున్నారు. ఈ నెల 27న జాతీయ నాయకులైన మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు వినతి పత్రాలు అందజేశారు. వేళాపాళా లేని విధులతో పని ఒత్తిడి పెరిగి పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆందళనలో భాగంగా అక్టోబర్ 10న రాష్ట్రంలోని 1.25 లక్షల మంది గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు విజయవాడ మార్చ్ నిర్వహించనున్నారు. ప్రభుత్వానికి తాము ముందస్తు సమాచారం ఇచ్చినా స్పందించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్టోబరు ఒకటో తేదీన యథావిధిగా పింఛన్లు పంపిణీ చేస్తామని, ఇదే క్రమంలో అధికారిక వాట్సాప్ గ్రూపుల నుంచి వైదొలుగుతామని హెచ్చరిస్తున్నారు. ఏలూరు కార్పొరేషన్‌లో 500 మందికి పైగా సచివాలయ ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరంతా ఇటీవల ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక జేఏసీ ఆధ్వర్యంలో నగర కమిషనర్ ఎ.భాను ప్రతాప్‌కు ముందస్తు వినతి పత్రం అందజేశారు. తమపై పెరిగిన పని ఒత్తిడిని తగ్గించాలని డిమాండ్ చేశారు.

ప్రధాన డిమాండ్లు ఇవే..

- నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలి.
- ఆరేళ్లపాటు ఒకే క్యాడర్‌లో సర్వీస్ చేసిన వారికి ఏఏఎస్ ప్రకారం స్పెషల్ ఇంక్రిమెంట్ మంజూరు చేయాలి.
- రికార్డు అసిస్టెంట్ క్యాడర్‌ను జూనియర్ అసిస్టెంట్ క్యాడర్‌కు మార్చాలి.
- అన్ని విభాగాల వారీగా ప్రమోషన్ చానల్స్ ఏర్పాటు చేసి జిల్లాల వారీగా సీనియారిటీ జాబితా విడుదల చేయాలి.
- స్టేషన్ సీనియారిటీ ఆధారంగా పారదర్శక బదిలీలు జరిగే ప్రత్యేక విధి విధానాలు ఖరారు చేస్తూ ఉత్తర్వులు విడుదల చేయాలి.

ప్రధాన సమస్యలు

- సర్వేలు, ఇతర పనుల నుంచి విముక్తి కల్పించాలి.
- మాతృశాఖలకు అప్పగించాలి.
- సమయ పాలన లేని ఒత్తిడితో కూడిన విధుల నుంచి విముక్తి కల్పించాలి.
- కార్యాలయ పనివేళలు పాటించకుండా సెలవుల్లో బలవంతపు విధులు చేయించరాదు.

ఆందోళనకు సంఘీభావం



సచివాలయ ఉద్యోగులపై పని ఒత్తిడి తగ్గించాలి. వేళాపాళా లేకుండా వారికి పనులు కల్పించడం తగదు. వారి ఆత్మ గౌరవానికి భంగం కలుగని విధంగా విధులు కేటాయించాలి. రాష్ట్ర వ్యాప్తంగా సచివాలయ ఉద్యోగులు చేపట్టిన ఆందోళనకు ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ తరుపున సంఘీభావం తెలుపుతున్నాం.

– బి.సోమయ్య, ఏపీ మున్సిపల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు, ఏలూరు

సమస్యలు పరిష్కరించాలి



సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి. వాలంటీర్ల వ్యవస్థను రద్దు చేయడంతో ఉద్యోగులపై అధిక పనిభారం పెరిగింది. గతంలో వాలంటీర్లు చేసే ప్రతిపనీ నేడు సచివాలయ ఉద్యోగులు క్షేత్రస్థాయిలో చేయాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ఉద్యోగులు తీవ్ర ఒత్తిడికి, మానసిక క్షోభకు గురవుతున్నారు.

– బండి వెంకటేశ్వరరావు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి, ఏలూరు

హేలాపురి బాలోత్సవాన్ని సమర్థవంతంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న రిటైర్డ్ ఎంఈఓ కోటేశ్వరరావు

ఏలూరు (టూటౌన్): హేలాపురి బాలోత్సవాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని రిటైర్డ్ ఎంఈఓ మారుబోయిన కోటేశ్వరరావు అన్నారు. యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన హేలాపురి బాలోత్సవం పిల్లల సంబరాలు ఆరవ ఆహ్వాన సంఘ ఏర్పాటు సమావేశానికి ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు స్వాగతం పలికారు. ఆహ్వాన సంఘం నిర్వాహక కమిటీని ప్రతిపాదించారు. అకడమిక్ టీం తరఫున కోఆర్డినేటర్ షేక్ ముస్తఫాలి, కల్చరల్ అంశాల తరఫున దువ్వి హేమ సుందర్ మాట్లాడారు.

వినతుల పరిష్కారానికి కృషి

దెందులూరు: స్మార్ట్ కార్డులు పంపిణీపై పీజీఆర్ఎస్‌లో వచ్చిన వినతుల పరిష్కారానికి వీఆర్‌ఓలు కృషి చేయాలని ఏలూరు రూరల్ ఇన్‌చార్జి తహసీల్దార్ ప్రియదర్శిని అన్నారు. సోమవారం ఏలూరు రూరల్ మండల కార్యాలయంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. స్మార్ట్ కార్డుల పంపిణీ, ఇళ్ల స్థలాల మంజూరుకు వచ్చిన దరఖాస్తులపై గ్రామాల వారీగా వీఆర్‌ఓలతో ప్రియదర్శిని సమీక్షించారు. డిప్యూటీ తహసీల్దార్ నాగమణి ఉన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న కమిషనర్ భానుప్రతాప్

ఏలూరు (టూటౌన్): పీఎం స్వానిధి పథకం ద్వారా అందుతున్న రుణాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) సూచించారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన లోక్ కళ్యాణ్ మేళాలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పీఎం స్వనిధి 2.0 పథకం కింద వీధి విక్రయదారుల నమోదు ప్రక్రియ, రుణాల మంజూరు, డిజిటల్ పేమెంట్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, కమిషనర్ ఎ.భాను ప్రతాప్, మెప్మా ప్రాజెక్ట డైరెక్టర్ పి.మాధవి, ఎల్‌డీఎం నీలాద్రి, మెప్మా జిల్లా కోఆర్డినేటర్ సీహెచ్ మహాలక్ష్మి, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ బి.ఝాన్సీ రాణి తదితరులు పాల్గొన్నారు.

అరాచకాలకు మూల్యం చెల్లించక తప్పదు



డిజిటల్ బుక్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న వాసుబాబు, పార్టీ నేతలు

గణపవరం: అధికారం చేతిలోఉంది కదా అని కూటమి నేతలు అరాచకాలకు పాల్పడుతూ వైఎస్సార్ సీపీ నాయకులపై తప్పుడు కేసులు, దాడులకు పాల్పడితే తగిన మూల్యం చెల్లించక తప్పదని ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు పుప్పాల వాసుబాబు హెచ్చరించారు. సోమవారం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఇటీవల పార్టీ అధినేత వైఎస్ జగన్ ప్రారంభించిన డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్లను నేతలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో అన్యాయానికి గురైన ప్రతి కార్యకర్తకు పార్టీ తరపున డిజిటల్ బుక్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యకర్తలకు అండగా ఉండటం కోసమే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కొత్త వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి నడింపల్లి సోమరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు దండు రాము, సంకు సత్యకుమార్, కోడే కాశీ, కమ్మిల భాస్కరరాజు, దండు గోపిరాజు, తలమంటి వెంకటేశ్వర్లు, కొట్టు నరేష్, జీవీ గాదిరాజు, కర్రి శ్రీనివాసరెడ్డి, సంకు శ్రీనివాసరావు, అలుమోలు గంగారాం, మీసాల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ ఉద్యమ కేసుల కొట్టివేత

ఏలూరు(మెట్రో): గతంలో సీపీఎస్ ఉద్యమం చేసిన సందర్భంగా నమోదైన కేసులను న్యాయస్థానం కొట్టివేసిందని జిల్లా ఎన్‌జీఓ అసోసియేషన్ అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

అడవి కాదు.. స్టేడియం



పూర్తిగా పాడైన వేదిక పైభాగం

ఏలూరు నగర నడిబొడ్డున ఉన్న ఇండోర్ స్టేడియం పిచ్చిమొక్కలతో అడవిని తలపిస్తోంది. క్రీడాకారులకు అందుబాటులో ఉండాల్సిన ఈ స్టేడియం విషసర్పాలకు నిలయమైంది. స్కేటింగ్ నేర్చుకునే వారు, సెలవు రోజుల్లో ఆడుకునేందుకు వచ్చిన విద్యార్థులు పిచ్చిమొక్కలతో ఇబ్బందులు పడుతున్నారు. స్టేడియం వేదికపైన భాగంగా పూర్తిగా పెచ్చులూడిపోయింది. స్టేడియం చుట్టూ జిల్లా కార్యాలయాలు ఉన్నా అధికారులు పట్టించుకోవడంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇండోర్ స్టేడియం అభివృద్ధికి కృషి చేయాలని నగరవాసులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్ / ఏలూరు



స్టేడియం ప్రాంగణంలో పిచ్చిమొక్కలు



పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్న స్కేటింగ్ ట్రాక్



ఫుట్‌బాల్ కోర్టుకు వెళ్లేదారి ఇలా..



గడ్డితో నిండిన ఇండోర్ స్టేడియం

సరస్వతీదేవీ నమోస్తుతే



కాశీ అన్నపూర్ణాదేవి



పత్తేబాద కనకదుర్గమ్మ



12 పంపుల సెంటర్‌లో..



శనివారపుపేట కనకదుర్గమ్మ



సౌభాగ్యలక్ష్మి



వేణుగోపాలస్వామి ఆలయంలో..



బావిశెట్టివారిపేటలో..

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): దేవీ శరన్నవ రాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. సోమవారం అమ్మవార్లకు సామూహిక కుంకుమ, అష్టోత్తర శతనామ పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవార్లను దర్శించుకున్నారు. సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో మహాలక్ష్మి, విద్యాలక్ష్మి అలంకరణలో, శనివారపు పేటలోని కనకదుర్గమ్మ, కాశీ అన్నపూర్ణసమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో, పత్తేబాద కనకదుర్గమ్మ, సత్రంపాడు సౌభాగ్యలక్ష్మి, 12 పంపుల సెంటరు కనకదుర్గమ్మ, భావిశెట్టివారిపేట కనకదుర్గాంబ సరస్వతిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

పోణంగి కామాక్షమ్మ సేవలో జేపీ



కామాక్షమ్మ వారిని దర్శించుకుంటున్న జయప్రకాష్

ఏలూరు టౌన్: పోణంగిలోని కామాక్షమ్మ వారిని వైఎస్సార్‌సీపీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ (జేపీ) పార్టీ నేత గేదెల సూర్యప్రకాష్ ఆహ్వానం మేరకు దర్శించుకున్నారు. సరస్వతీ అవతారం సందర్భంగా పిల్లలకు పుస్తకాలను జేపీ చేతులమీదుగా అందజేశారు. ఎంఆర్‌సీ కాలనీ కనకదుర్గమ్మవారిని జేపీ పార్టీ నేత ఎం శ్రీనివాస్ ఆహ్వానం మేరకు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. చిన్నారులకు పుస్తకాలు అందజేశారు. నాయకులు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్ బాబు, నెరుసు చిరంజీవి, కొల్లిపాక సురేష్, పాతినవలస రాజేష్, ఘంటా సాయి ప్రదీప్, ఎచ్చెర్ల ఉమామహేశ్వరరావు, ఉయ్యాల గణేష్, సింగవరపు నారాయణ, తెర్లి లక్ష్మీనారాయణ, చింతల అప్పారావు, ఓరు లక్ష్మణరావు, సింగిరెడ్డి శివాజీ, పెద్దింటి సింహాచలం, కుమారి, కృష్ణ, రాజు, నాయుడు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	24	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	30	చిక్కుడు కాయలు	64
వంకాయలు (కాంతులు)	40	బీట్లచిక్కుడు	00
వంకాయలు (తెలుపు)	00	చామదుంపలు	38
బెండకాయలు	30	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	44	కంద	00
కాకర కాయలు	36	బీట్‌రూట్	44
బీరకాయలు	36	కీరా దోస	44
బీరకాయలు (పందిరి)	40	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	26	అల్లం	76-96
క్యారెట్	44	కొత్తిమీర (కట్ట)	30
దొండకాయలు	40	పాలకూర	10
బంగాళదుంపలు	34	తోటకూర	10
ఉల్లిపాయలు	25	చుక్కకూర	10
గోరుచిక్కుడు	40	గోంగూర	07-10
దోసకాయలు	28	పుదీనా	05
ఆనబకాయ (1)	20	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	48

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	30
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	31
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	40
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	22
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	25
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	27
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	29
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	25
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	28
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	26
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	22
ఏలూరు - తిరుపతి	16.00	4830	34

సబ్ జైలు ఆకస్మిక తనిఖీ

చింతలపూడి: ఏపీ ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లాల ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్ ఎస్.శ్రీదేవి సోమవారం చింతలపూడి సబ్ జైలును ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి నిందితుల కేసుల వివరాలు వారికి అందిస్తున్న ఆహార పదార్థాలు మంచినీటి సౌకర్యాలను పరిశీలించారు. అదే విధంగా సబ్‌జైలులో అనారోగ్యంగా ఉన్న నిందితుల గురించి ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ జైలు ప్రాంగణంలో ఉచిత న్యాయ సహాయ కేంద్రాన్ని అవసరమైన వారు ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్, జైలు సూపరింటెండెంట్ కృపానందం, బార్ అసోసియేషన్ సభ్యులు, కోర్టు సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

జంగారెడ్డిగూడెం: పట్టణాభివృద్ధికి అధికారులు, కౌన్సిలర్లు సమన్వయంతో పనిచేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో కౌన్సిల్ సమావేశం బత్తిన లక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పట్టణంలో అన్ని వార్డుల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. కౌన్సిల్ సభ్యులు చిటికెల అచ్చిరాజు, ఇందిరా ప్రియదర్శిని, ముప్పిడి అంజి, వలవల తాతాజీ, కంచర్ల గీతాకుమారి, దొంతు మధవ, నేత్ర సుబ్బలక్ష్మి తదితరులు మాట్లాడుతూ పట్టణంలో వీధి దీపాలు సరిగా పనిచేయడం లేదని అధికారులు దృష్టి సారించాలన్నారు. ఎస్‌ఆర్ నగర్‌లో రోడ్డు పూర్తిగా ధ్వంసమైందని మరమ్మతులు చేపట్టాలని సుబ్బలక్ష్మి కోరారు.